'జులూస్'

దర్శన్

"అబ్బ ! ఏం ఎండ ?" అనుకున్నాడు కృష్ణ పాపయ్యపేటచమన్ దగ్గరికి రాగానే, అక్కడ మూడురోడ్లకూడలివుంది. చమన్ ఎన్నడో రూపుమాసి పోయినా పేరింకా అలాగేవుంది. అప్పుడు సమయం తొమ్మిదిన్నర అవుతుంది. సూర్యుడు అప్పుడే మేడలపై నించి తలెత్తాడు. ఐనా ఉక్కగావుంది. సెప్టెంబర్ మాసంలో ఉండాల్సిన చెమ్మ, చలీలేవు ఉక్కగా వుంది.

అక్కడ ఒకనిమిషం ఆగి జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖాన్ని తుడుచుకుని రోడ్డునిదాటి ఎల్లమ్మబజార్ వైపువెళ్ళే సందులోకి దూరాడు కృష్ణ చేతిలో న్యూస్ పేపర్ చుట్టివున్న వస్తువేదో ఒకమూరెడు పొడుగువుంది దాన్ని ఆ చేతినుంచి ఈ చేతికి మార్చుకుంటూ రెండోచేత్తో అప్పుడే వస్తున్న నూనూగు మీసాల్ని తడుముకుంటూ పెద్దపెద్ద అంగలు వేస్తూ నడుస్తున్నాడు,

మట్టెవాడ హైస్కూలు పక్కనించి నడుస్తూ ఎందుకైనా మంచిదని అతడు పక్కనే వున్న మసీదు సందులోకి తిరిగాడు. అతని అనుమానం నిజమే. సూటిగా వెళితే ఎల్లమ్మ బజారు సారాదుకాణం దగ్గర పోలీసులో వాళ్ళతొత్తులో ఉండితీరుతారు. అతను దారిమార్చి ముస్లిం వీధిలోకి ప్రవేశించటం కొంతనయం. ఆవీధిలో ఇళ్ళన్నీ

కున్నరు. కొపమూసనోడు సెట్లు గుట్టలు పట్టుకపోయిండు" అతని గొంతు ఖంగుమని మోగింది

చెప్పడం మధ్యలోనే ఆపేసి అతను ఎర్రటెండలో రోడ్డుమీది కెక్కాడు. ఇప్పుడతను చెత్రీలు బాగు చేయడం గురించి పూర్తిగా మరిచిపోయాడు. "పాపంపండుతది....అప్పుడు హరిహరాదులు అడ్డంవచ్చినా దొంగల పనిపడ్తరు." పెద్దగా అనుకుంటూపోతున్నాడు.

శ్యామల మనసుపూర్తిగా చెదిరిపోయింది. ఆర్ద్రతతో, కోపంతో తన మిత్రులతో కిష్టయ్య పదేపదే చెప్పే మాటలు గజిబిజిగా – ఇప్పుడామెకు రెండుమోహరించిన ప్రపంచాలు కన్పించాయి. తనభర్త చెత్రీలు బాగుచేసే అతను ఒకే ప్రపంచంలో నిలుచున్నారు. వీళ్లిద్దరు తమ శత్రువులతో రాజీ పడదలుచుకోలేదు. అంటే – తన పిల్లలు, తనకలలు – అన్నికుప్ప కూలిపోతాయా?

ఆకాశం కుప్పకూలి తనమీద తనపిల్లలమీద పడుతున్నట్లుగా శ్యామలకు తోచింది. పిల్లలను దగ్గరికి తీసుకొని కుర్చీలో కూలబడ్డది.

"కుప్పకూలే ఆకాశానికి ఎవరు చేతులడ్డం పెట్టలేరా? " శ్యామల మనసు మూలుగుతోంది.

చిత్రంగా కూలిపోతున్న ఆకాశానికి తనభర్త తన మసి చేతులు అడ్డం పెట్టాడు కిష్టయ్య మిత్రులంతా కిష్టయ్య చేతులతో చేతులు కలుపుతున్నారు. వాళ్ళంతా అదేపనిలో ఉన్నట్లుగా శ్యామలకు అర్థమైంది.

తలుపులు మూసివుంటాయి. వీధుల్లో జనం ఎవరూ ఉండరు. ఐతే అది ఒకందుకు ప్రమాదం గూడా ఏ ఇంటి తలుపైనా అకస్మాత్తుగా తెరుచుకుని ఏ పోలీసువాడో ప్రత్యక్షమైతే ? కృష్ణ కుడిచేతిలో వున్న వస్తువుని గట్టిగా పట్టుకుని నడుస్తున్నాడు.

అతని తలొంచికేసుంది గానీ చూపులు వెనక్కి తప్ప అన్నిదిక్కుల్నీ కని పెడుతున్నాయి. అతని చెవులు చీమచిటుకు మన్నా పట్టుకుంటున్నాయి. అప్పుడప్పుడు వెనుతిరిగి చూస్తూ చకచకా అడుగులేస్తున్నాడు,

అతని మనసు ఎంత ఉద్వేగంగా వుందో చెప్పలేం, అతని మనసుఎంత నిమ్మళంగా వుందో అదీ చెప్పలేం ఎవడన్నా వయాసుని అంటి పెట్టుకున సాహసం ఉంటుందంటే వాణ్ణిదొరకబుచ్చుకుని తన్నాలి. కృష్ణ వయసు అతని చర్యలకి ఏ మాత్రమూ చాలదు. ఐనా అతడు తనది సాహసమని అనడు. అది అవసరం అంటాడు

అతడిప్పుడు నడుస్తూ ఒక విషయం ఆలోచిస్తున్నాడు గతరాత్రి కాజీపేట మార్కెట్‌లో రాత్రి ఎనిమిది గంటలతర్వాత అకస్మాత్తుగా కోళ్ళన్నీ ఎందుకు అయి పోయాయో, బార్లలో, బ్రాందీషాపుల్లో ఎందుకు రద్దీపెరిగిందో అని సామాన్యంగా కార్మిక ప్రాంతాల్లో పండగరోజున తప్ప అలా జరగదు. మరినిన్న ఏం పండగ ?........

అతడు తనలో తాను నవ్వుకుని కుడిచేతిలో పేపర్ చుట్టి వున్న వస్తువుని ఓసారి ఎగరేసి అందుకుని ఎడంచేత మొలక మీసాల్ని నిమురుకున్నాడు సందు మూల తిరిగేచోట ఒక చెత్తకుండీవుంది. దాని చుట్టూ పందులగుంపొకటి నిదానంగా పడుకునివుంది.

అతను ఆ గుంపుని అతి జాగ్రత్తగా గంతేసి దాటి మెయిన్ రోడ్డెక్కాడు. అది మహబూబియా పంజెతన్ కాలేజీ. అక్కడ ఒక్కనిమిషం ఆగి రెండువైపులా చూశాడు. ఒకవైపు ఎంచుకుని అటుసాగాడు. ఆరోడ్డు ఎల్లమ్మ బజారు మార్కెట్ వైపు సాగుతుంది చాలా రద్దీగా వుంది. ఒకర్నొకరు తోసుకుని పోవాల్సిన రోడ్డు అది.

"కలకత్తా రోడ్లిలాగే వుంటాయేమో!" అనుకుంటూ నడిచాడతను. సోమ వారం కావటం వల్ల కాలేజీ పిల్లల రద్దీ, మార్కెట్ జనం రాకపోకలు, సామాన్య జనం-అంతా ఇరుగ్గావుంది. రోడ్ల మీదే కూరగాయలు కుప్పలుగాపోసి అమ్ముతున్నారు మాంసందుకాణాలు మురిక్కాలవల మీదే పెట్టుకుని కూచున్నారు. ఎండుచేపలు, పచ్చి చేపలు కంపుకొడుతూ వుండేవాటిని తప్పించుకోటానికి ముక్కు మూసుకుని నడుస్తున్నారు జనం. అంత ఇరుకులోనూ చాయ్‌వాలా దగ్గర నిలబడి టీ తాగు తున్నారు కొందరు. కృష్ణ బాణంలా దూసుకుపోతూ ఆ జనాన్నించి బయటపడి మండీ బజార్ వైపు తిరిగాడు.

పొద్దున్నే బయల్దేరాడు గదినుంచి అప్పటి నుంచీనడకే, విశ్రాంతిలేదు.

కనీసం టీ అయినా తాగలేదు. ఎక్కడికి వెళదామన్నా ముందూ వెనకా ఆలోచించాల్సి వస్తోంది. రాత్రినుంచీ ఊరంతా అట్టుడికి పోతూంది ఎన్నడూ ఆవూరి చరిత్రలో జరగని విషయం అది.

ఒకపోలీసు యస్సయిని రద్దీగా ఉన్న రైల్వే ప్లాట్‌ఫారం మీద కాల్చి చంపటం మాటలా? పైగా చంపిన వాళ్ళెవరూ దొరకలేదు. ఈ పరిస్థితిలో తనలాంటి వాడు కనిపిస్తే ఇంకేమన్నా వుందా ? ఆదేదో తన మీదికి తోసేసి కసితీర్చుకోరూ? అసలు పోలీసులు ఇప్పుడెంత కోపంగా ఉన్నారో ? ఎవర్ని అరెస్టు చేశారో, ఎవర్ని హింసిస్తున్నారో తెలిస్తే బాగుండును.

అతడు మండీబజారు వేపచెట్టు దగ్గరికి వచ్చేసరికి జనమంతా గగ్గోలు పడుతూ కన్పించారు. అది అసలే మెయిన్‌రోడ్డు కావటం వల్ల గోలగావుంది, రోడ్డెక్కదామనుకున్న వాడల్లా ఆగిపోయాడు. ఎందుకైనా మంచిదని పక్కనే వున్న పాకల హోటలు వైపు నడిచి సింగిల్ టీకి ఆర్డరిచ్చి ఓ పక్కగా నిలబడ్డాడు. అతనికి ఎడమ ప్రక్కగా రిక్షాలవాళ్ళు రిక్షాలు ఆపుకుని టీలు తాగుతూ చెప్పుకుంటున్నారు.

"ఎబ్బ ఎంత పెద్ద జులూస్ అనుకున్నవ్ ? ఊళ్లె ఉన్న పోలీసులంత ఆ ఊరేగింపుల్నే ఉన్నరు ముందట ఏస్పీ, డీ ఎస్పీ నడుస్తాంటె వాళ్ళ ఎనుక వ్యాను మీద సచ్చినోని పీనుగ బెట్టిన్రు. దానికి దండలు గిండలు ఏసి ఇంతకుంకుమ జల్లిన్రు జై జై అంటాన్రు" అన్నాడొకతను.

'నీయవ్వ ! వీడు సరీగా ఇనలేదురా. మాయస్సయిని జంపిన రాడికల్స్‌ను నాశనం జేస్తం. ఓ ప్రజలారా సూడున్రి రాడికల్స్ దౌర్జన్యం దీనికి మీరే సాక్షం అనుకుంట లొల్లి బెట్టిన్రు' ఇంకొకతను సరిదిద్దాడు

'కని ఈ పోలీసుల జులూస్ దీసుడేంది-! గమ్మతుగున్నది. మనప్పారు ఏమయి పోతాందో అర్థమైతలేదురా వారీ!' ఒక ముసలతను అన్నాడు

ఇంతలో హోటలువాడు కృష్ణకి టీ అందించాడు అతడు టీ తాగుతూ వారి మాటలు వింటున్నాడు. వాళ్ళు చెప్పుకునేది వింటే అతని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి

"అసలు ఆ పోలీసుల్ని ఎవరు జంపిన్రట ?"

'ఎవరేంది ? రాడికల్సేనట గదా ! వాల్లకూ వీల్లకూ పడదు. వాల్లను వీల్లు జంపుతురు వీల్లను వాల్లు జంపుతరు.'

'అనుకునుడేగని రాడికలోల్లు పోలీసుల నెప్పుడు జంపిరి ? రాడికలోల్లనే పోలీసులు శానమందిని సంపి అవుతల పారేశిన్రు. మొన్న మొన్న సుదర్శన్ అనెటోన్ని సారంగపాణి అనెటోన్ని కొట్టి సంపలేదా ? అప్పట్నుంచి వాల్లు పగబట్టిన్రు.'

"మరి ఎంత కని ఊకుంటరు? ఏదన్న ఉంటె తిట్టాలె కొట్టాలె జెల్ల పారెయ్యాలె గని సంపుడేనా?"

ఇంతలో ఒక రిక్షా అతను వేగంగా రిక్షా తొక్కుకుంటూ వచ్చాడు. ఒక్క ఉదుటన రిక్షాను ఆపి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"అరేయి ఇన్నార్రా ఎంత కతైందో!" అన్నాడు ఎగపోస్తూ.

"ఏందిరా ఏమయింది?"

"మన డాక్టరుసాబును పోలీసులు సంపేసిన్రు. ఇప్పుడే అయింది."

"ఎహె! నిజంగనా?" అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. వాళ్లకది నమ్మశక్యం కాలేదు.

"నిజమేరా! నేను అక్కన్నే అడ్డమీద ఉంటిగద. జులూస్ వస్తాందని కొంత మందివచ్చి మమ్ములందర్ని అడ్డమీది నుంచి రిక్షాలన్ని తీసెయ్యమన్నరు. పోలీసుల తోటి లొల్లి ఏందని అందరం అక్కన్నుంచి అటేటు పోయినం. కొద్దిగ దూరం పోయినం గని మాకంత కనబడ్తనే ఉన్నది."

చెపుతున్న వాడికి ఏడుపే తక్కువగా ఉంది. వింటున్న కృష్ణ గుండెలు గుబగుబలాడాయి. అతని కళ్లముందు చీకటి కమ్మినట్టయింది. నిలబడలేక అక్కడ బెంచీమీద కూలబడ్డాడు. అంతవరకూ ఫ్రీగా మాట్లాడుకుంటున్న రిక్షావాళ్ల గొంతులు దగ్గర పడ్డట్టుగా మౌనం వహించారు. వారిముఖాల్లో భయం తాండవించింది. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. కృష్ణకి టీ తాగబుద్ధి కాలేదు. గ్లాసును టేబులు మీద పెట్టేశాడు.

వీళ్ళు చెప్పుకుంటున్న విషయం నిజమేనా ? వివరాలు తెలుసుకోవడం ఎలా అతనికే మార్గమూ తోచలేదు. పట్టరాని ఉద్వేగంతో అతని శరీరం కంపించింది. ఏదో గ్రహణం సంభవించి ఆకాశంలో సూర్యుడు మాయమైనట్టు తోచింది. చెవులకు ఏదో మహాశిలాపాతాల ధ్వని వినిపించినట్టుగా తోచింది. క్షణంలో ఒక నిర్ణయానికి వచ్చాడు. లేచి టీ డబ్బులు చెల్లించి ట్రిగర్ విడిచిన తూటాలా ఎల్లమ్మబజార్ సందులో పడి దూసుకుపోయాడు. జ్వరం వచ్చిన వాడిలా వున్నాడతను. అతని శరీరం శ్వాసిస్తోందో లేదో తెలియదు. అతనిలో రక్తం పారుతోందో పొర్లుతోందో తెలియదు.

రెండే రెండు నిమిషాల్లో దుర్గేశ్వరస్వామి గుడిసందులోంచి డాక్టరుగారి అస్పత్రిని చేరాడు. అక్కడంతా జనం గుమిగూడి ఉన్నారు. ఎవరి ముఖంలో చూసినా భయం, మృత్యువు పరిచిన నల్లని ఛాయలు ఉన్నాయి. గొంతు విప్పి ఎవరూ మాట్లాడటంలేదు. రాత్రింబగళ్లు ట్రాఫిక్ ఆగని ఆ రోడ్డుమీద జనంతో పాటు కాలం గూడా స్తంభించి పోయింది. డాక్టరుగారి అస్పత్రి తలుపులు మూసి ఉన్నాయి. అస్పత్రి ముందు ఎవరూ జనంలేరు. అవతలి పక్క బస్‌స్టాప్‌లోనూ, ఎదురుగా బ్యాంకులోనూ పెట్రోలు పంపు దగ్గరా దూరంగా కిళ్ళీకొట్ల దగ్గిరా జనం తమతమ పనుల మీద ఉన్నట్టుగా ఉన్నారు:

అస్పత్రివైపు ఎవరూ చూడటంలేదు. కానీ అందరి చెవులూ, కళ్ళూ అస్ప

త్రినే గమనిస్తున్నాయి. కృష్ణకూడా ఏమీతోచక ఒక కిళ్ళీకొట్టు దగ్గరికి చేరాడు. అల వాటున్నవాడిలాగా ఒక సిగరెట్టు ముట్టించి తాగుతున్నట్లు నటిస్తూ నిలబడ్డాడు. ఆ కిళ్ళీకొట్టు దగ్గర పది మంది దాకా ఉన్నా ఎవరూ ఏమీ మాట్లాడటంలేదు. కృష్ణ మనస్సు ఉద్వేగంతో ఊగిపోతోంది. అతనిలో ఉత్సుకత అగటంలేదు, సిగరెట్టు పీలుస్తున్న అతని పేళ్ళు వణుకుతున్నాయి. అందోళనని అణుచుకునే ప్రయత్నంలో అతడు ఉన్నాడు. కానీ నిశ్శబ్దమైన రోడ్డు ఆ ప్రయత్నాన్ని సఫలం కానివ్వటంలేదు పజిల్ ముందు పెట్టుకొని కూచున్నవాడిలా ఉన్నాడు కృష్ణ. అతనికి ఏమీ అర్థం కావటంలేదు ఆ సమయంలో దూరంనించి వస్తూ రాజయ్య కన్పించాడు. అతన్ని ఎలా పలుకరిద్దామా అని కృష్ణ ఆలోచిస్తుండగానే రాజయ్య అతన్నిచూశాడు. చూసి చూడనట్టుగా నటిస్తూ రాజయ్య అతనిదగ్గిరిగా వచ్చాడు కిళ్ళీకొట్లో ఒక సిగరెట్టు కొనుక్కొని తానుగూడా పీలుస్తూ కృష్ణ పక్క నిలబడ్డాడు,

కృష్ణ అతణ్ణి ఓరకంట చూశాడు. రాజయ్య అది గమనించి "ఎంత ఘోరం" అన్నాడు అతనితో. కృష్ణకి డాక్టరుగారి హత్య నిజమే అని అర్థమై పోయింది. అతని కాళ్ళు గజగజలాడాయి. నిలబడలేక పక్కనే వున్న పోస్టుడబ్బాని అనుకొన్నాడు. అతని చేతిలోని సిగరెట్టు జారి పోయింది రాజయ్య అతనికి సైగ చేసి పక్కనేవున్న బ్యాంకులోకి దారితీశాడు. కృష్ణ అతణ్ణి అనుసరించాడు.

* * * *

ఆ ఉదయం ఒక రాకాసి నీడలాగా ఊరిమీద పరుచుకుంది. ఆకాశంమీద బూడిదరంగు చారలు మేఘాలుగా ఆక్రమించుకున్నాయి. ఆ చారలు దగ్గిరౌతూ గాఢంగా, గట్టిగా, ఒక విషకుండలంలాగా ఊరిమీదకి జారాయి.

అప్పుడు సరిగ్గా సమయం ఉదయం తొమ్మిది గంటల పదినిమిషాలు ఆసమ యంలో చీమకూడా నడవ సందు లేనంత రష్‌లో ఆ రోడ్డుమీద ఒక వూరేగింపు అది అల్లాటప్పయ్యది కాదు- తీవ్రవాదుల చేతుల్లో హతం చేయబడ్డ ఒక యస్సయి శవం వూరేగింపు. ఆ వూరేగింపు రెండుగజాల వెడల్పుతో ఫర్లాంగు పొడవుతో వుంది.దాని మొదలు డాక్టరుగారి అస్పత్రి దగ్గర వుంటే కొనలక్ష్మీటాకీసు దగ్గర వుంది. ఊరేగింపులో రెండువ్యాన్లూ, ఒక జీపూ, చివరా మొదట మరో రెండు వైర్లెస్ జీపులూ వున్నాయి. అ వూరేగింపులోని జనమంతా యూనిఫారంలో వున్నారు. అంచేత అందరూ పోలీసులే అన్నది నిశ్చయం. ఐతే ఆ వూరేగింపుకి నాయకత్వం వహించిన ఎస్పీ, డీఎస్పీలు ముందు నడుస్తూంటే కొందరు పోలీసు ఆఫీసర్లు వాళ్ళని అనుసరిస్తున్నారు. వాళ్ళలో కొందరు మఫ్టీలో ఉన్నారు ఐతే ఊరేగింపులో పాల్గొన్న ప్రతీ ఆనాయకుడు అసాధ ధారే అన్నది వేరే చెప్పాల్సిన పనిలేదు.

ఊరేగింపు డాక్టరుగారి అస్పత్రిని చేరేముందు అస్పత్రిదగ్గరున్న రిక్షాలన్నిటినీ ఎవరో తరిమేశారు. డాక్టరుగారి అస్పత్రికి వెనుక ఒక సందు వుంది. మెయిన్

రోడ్‌మీద వున్నదుకాణాలన్నిటికీ వెనుక దర్వాజాలు ఆసందులోకే వుంటాయి. అలాగే అస్పత్రి వెనుక దర్వాజాగూడా.

శవం వూరేగింపు ఇంకా ఆస్పత్రిదాకా రాకముందే కాంపౌండరు వచ్చి డాక్టర్ని హెచ్చరించాడు.

"సార్! పోలీసులు ఊరేగింపుగా వస్తున్నారు. అసుపత్రి మూసేద్దాము?"

పేషెంటుని పరీక్షిస్తున్న డాక్టరు తలెత్తాడు. అతని మొహంమీద ఎన్నడూ చెరగని చిరునవ్వుతో అన్నాడు. "పోలీసులు వస్తే మనకేమిటయ్యా! వాళ్లు మనల్నే మంటారు?"

కాంపౌండరు తటపటాయించాడు "అదికాదు సార్! చాలామంది ఉన్నారు. పైగా ఊరేగింపునిచూసి షాపులన్నీ మూసేస్తున్నారు. మనం గూడా మూసేస్తే మంచిది" అన్నాడు.

"సరే, ఇప్పుడు లోపలున్న పేషంట్లని మాత్రం ఉంచి తలుపులు వేసెయ్యి. వీళ్ళని చూసి పంపెయ్యాలిగదా!" డాక్టరు అనటంతో కాంపౌండర్ బయటికి వెళ్లి పోయాడు.

రెండు గదుల క్లినిక్ అది. ముందుగది వెయిటింగ్‌రూం గానూ రెండోగది కన్సల్టింగ్ రూంగానూ ఉంది. పరీక్ష చేయించుకున్న తర్వాత రోగులు వెనక గుమ్మంలోంచో లేక పక్కనేవున్న వరండాలోంచో బయటికి వెళ్లిపోతారు.

ముందుగదిలో కిట కిట లాడుతూ ముప్పై నలభైమంది పేషెంట్లు ఉన్నారు. ఆ గదంతా పిల్లల కేకలు, ఏడ్పులతో మారు మోగి పోతోంది. పేషెంట్లు కొందరు కాలంగడపటం కోసం ఒకళ్ళతో ఒకళ్లు కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏవూరు మీది?" ఒకావిడ పక్కనున్నావిడ నడిగింది. ఆమె ఒడిలో చిన్న పిల్లాడొకడు చిక్కిశల్యమైనట్టుగా ఉన్నాడు. ఆవిడ పక్కన భర్తకాబోలు కూచున్నాడు.

"బెల్లంపల్లి." రెండో ఆమె జవాబిచ్చింది. ఆమె ఒడిలో గూడా ఒక పిల్లాడున్నాడు. "అబ్బో! అంతదూరంనుంచి వచ్చిన్రా? ఏమైంది పిలగానికి?"

"ఒకటే వాంతులు విరేచనాలు. పదిరోజులైంది. ఎందరు డాక్టర్లకు చూపెట్టినా తగ్గలేదు. ఎవరో చెప్పిన్రు, ఓరంగల్లుల ఈ డాక్టరుకు సూపెడితె పోద్దంటె వచ్చినం".

"అవు నిజమే చెప్పిన్రు. మాదిగూడ ఈ వూరుకాదు హుస్నాబాద. మాపోర గాడు రొండునెల్లాయె. తిండి తింటలేడు. రోజురోజుకు బక్కగైతాండు. ఎంత ఖర్చు బెట్టినా పైసలతొవ్వ పైసలదే మందు తొవ్వ మందుదే. మనిషి మీద ఆశ వదులు

కున్నం. ఈ డాక్టరు చెయ్యిబెడితె సాలు లేశి తిరుగుతడంటె ఆకరు ప్రయత్నం ఈడికి వచ్చినం"

ఇంతలో బయట ఊరేగింపు గోల వినవచ్చింది. పేషెంట్లలో కొందరు మగవాళ్లు లేచి బయటికి వెళ్ళారు

"ఏందిరా లొల్లి?" ఒకతను పక్కనున్నతనితో అన్నాడు.

"అరె! గిదేందిరో? పోలీసులే ఊరేగింపు దీస్రు?"

ఊరేగింపు క్లినిక్ ముందుకు వస్తుంటే లోపల్నించి కాంపౌండరు వచ్చాడు. "లోపలికి రండి. తలుపులు వేస్తున్నం అందరు లోపలికి రండి," అన్నాడు. బయట వున్న వాళ్ళంతా లోపలికి రాగానే తలుపులు వేసేశాడు. ఇంతలో ఊరేగింపు వచ్చి క్లినిక్ ముందు ఆగింది యస్సయి శవాన్ని ఉంచిన వాహనాన్ని క్లినిక్ ముందు ఆపారు.

"ప్రాణానికి ప్రాణం, రాడికల్స్ ! ఇక మీకు మూడింది జాగ్రత్త, ప్రజలారా రాడికల్స్ దౌర్జన్యం చూడండి" అని నినాదాలిస్తున్నారు. కాంపౌండర్ ఆ ఊరేగింపు చూద్దామని పక్క తలుపు తెరుచుకుని మేడ మెట్లు ఎక్కి పైన బాల్కనీలో నిలబడ్డాడు. లోపల గదిలో డాక్టరు మామూలుగా పేషెంట్లని పరిశీలిస్తున్నాడు బయట నిలబడ్డ ఊరేగింపులోని నినాదాలు అతని చెవులకి లీలగా సోకుతున్నాయి. వాటిని పట్టించుకోకుండా అతడు పరీక్షిస్తున్నాడు.

"ఏమైందమ్మా పాపకి?" తల్లిని ప్రశ్నించాడు అతడు.

"రాత్రి నుంచీ జ్వరమండీ!" ఆమె జవాబిచ్చింది. అలా ముగ్గురు నలుగురు పేషెంట్లని చూసి పంపే శాక బేసిన్‌లో చెయ్యికడుక్కుందామని వెనక్కి వచ్చిన అతడు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. ఊరేగింపు తన క్లినిక్ ముందే నిలిచి పోయింది. పదినిమిషాలయినా కదలటంలేదే ? అతని మనస్సు కీడుని శంకించింది.

గబగబ చేయి కడుక్కుని టవల్‌తో తుడుచుకున్నాడు. ముందుగది తలుపుతెరచి పేషెంట్లు ఎంతమంది ఉన్నారో చూశాడు. చాలామందే ఉన్నారు. "మీరంతా కాస్సే పాగండి. తర్వాత చూస్తాను" అని వాళ్ళతో చెప్పాడు. మళ్ళీ తలుపు దగ్గరగా వేసి బోల్టు బిగించాడు. టేబిల్ మీదున్న కళ్ళద్దాలు తీసితుడుచుకుంటూ వుండగా అకస్మాత్తుగా నీడలు కమ్మినట్టయింది. తల ఎత్తిచూస్తే వెనక గుమ్మంలోంచి నలుగురు వ్యక్తులు వస్తూ కన్పించారు. నలుగురి మొహాల్లోనూ భయంకరమైన కసి వెలుగుతోంది. మామూలు దుస్తులు ధరించి వున్నప్పటికీ వాళ్ళు సివిలియన్స్ అయివుండరని వాళ్ళ మొహాలే చెబుతున్నాయి. ఇద్దరువ్యక్తులు అరడుగుల ఎత్తు ఎత్తుకు తగ్గ లావులో బుంగమీసాలతో ఉన్నారు. మూడో వ్యక్తి ఎత్తుగానేవున్నా అడ్డ బలుపు

ఎక్కువగా ఉండటంతో కొంచెం పొట్టిగా కన్పిస్తున్నాడు. అతని మొహం సన్నగా వుంది. పెద్దపొట్ట. నాలుగో అతను ఎత్తుగావున్నా సన్నగా వున్నాడు అతని మొహంలో ఎవర్నీనమ్మని కుక్క తనం కనిపిస్తోంది. వాళ్ళు దూకుడుగా డాక్టరుకేసి అడుగులేశారు.

డాక్టరు ఒక్కసారి అదిరిపడ్డాడు. "ఏమిటిది? ఎవరు మీరు?" అంటూ వాళ్ళను నెట్టుకుని బయటకి వచ్చే ప్రయత్నంచేశాడు వాళ్ళు అతణ్ని వెనక్కి తోశారు. ఆతోపుడుకి డాక్టర్ టేబిల్ మీదికి తూలాడు. చేతిలోని అద్దాలు కింద పడ్డాయి. పరిస్థితి విషమిస్తోందని గ్రహించాడు. లేచి వాళ్ళని తోసుకుని గుమ్మంలోంచి బయటికి పరుగుతీశాడు.

డాక్టర్ తోసిన తోపుకి ఆ నలుగురూ వెనక్కి తూలారు అద్దాల బీరువాలు పగిలి మందుల సీసాలు కిందపడ్డాయి. వాటిని కసాపిసా తొక్కుతూ బయటికి పరిగెత్తాడు. గుమ్మంలోంచి బయటికి వచ్చిన డాక్టరు తోచిన దిక్కుకి పరిగెత్తాడు. ఏషాపన్నా వెనకనుంచి తీసి ఉంటుందేమోనని చూశాడు అన్నిటి తలుపులు మూసి ఉన్నాయి. వెనక్కి తిరిగి చూస్తే నలుగురూ వేటకుక్కల్లా పరిగెత్తుకొస్తున్నారు. వెనక్కి చూస్తూ ముందుకి పరిగెత్తటం వల్ల జారి మురిక్కాలవలో పడ్డాడు. పెక్కకి దెబ్బతాకింది. పాంటు మీద మురికి నీళ్ళు చిందాయి అరక్షణంలో లేచి ముందుకిపరిగెత్తాడు కనిపించిన తలుపునల్లా తట్టాడు, ఎవరూ తియ్యలేదు. అసలెవరికీ వినపడలేదు. ఒక తలుపు తీసి కన్పించింది. చటుక్కున లోపలికి దూరాడు అతని వెనకే ఆ నాలుగు వేటకుక్కలు గూడా దూరాయి. అతను లోపలికి ఐదారు అడుగులయినా వెయ్యకముందే ఆ నలుగుర్లో ఒకడు రివాల్వర్ తీశాడు.

డాక్టరు కళ్ళు వెడల్పయ్యాయి. "వద్దు నన్ను చంపవద్దు. తొందరపడుతున్నారు" అని అరిచాడు. సైలెన్సర్ ఉన్న రివాల్వర్ పళ్ళు బిగించి 'టుప్-టుప్' మని జవాబిచ్చింది డాక్టరుగారి పొట్టలోనికి, మెదడులోకి బులెట్లుదూరాయి. అయన స్పృహకోల్పోతూ నేలకొరిగాడు నలుగురు వ్యక్తులూ వచ్చిన పని పూర్తి కావటంతో వెనక్కి తిరిగి పారిపోయ్యారు.

షాపు ముందు నిలబడి ఊరేగింపుని చూస్తున్న వ్యక్తులు తమ షాపు వెనక గదిలో గోల ఏమిటా అని వచ్చేసరికి డాక్టరుగారు రక్తపుమడుగులో దొర్లుతున్నారు. వాళ్ళు భయంగా అరుస్తూ డాక్టరుగారి కాంపౌండర్‌ని పిలవటానికి పరిగెత్తారు ఊరేగింపు అప్పటికే కదిలి వెళ్ళిపోయింది.

గొల్లున ఏడుస్తూ అందరూ డాక్టరుగారి చుట్టూ చేరు రక్తంలో తడిసిన అతని శరీరం మంకెన పువ్వులా తయారైంది వేలాది మంది పిల్లల ప్రాణాలు అవలీలగాకా పాడిన వాడు తన ప్రాణాలు నిలుపుకోవటానికి శతథాప్రయత్నిస్తున్నాడు

కనీ డాక్టరు కావటం వల్ల తానిక బతకనని తెలిసిపోయింది. ఐనా తక్షణ సాయం అందింతే బతకవచ్చు.

"నన్ను తొందరగా గాంధీ ఆస్పత్రికి తీసుకుపోండి!" అస్పష్టంగా అన్నాడు. ఐనా అక్కడవారికి అర్థమైంది కొంచెం దూరంలోవున్న మరో డాక్టర్‌ని కారు అడగటానికి ఒకరిద్దరు పరిగెత్తారు. వాళ్ళు వచ్చేలోపల డాక్టర్‌గారి స్థితి మరింత క్షీణించింది. అసలే ఆయన డయాబిటిస్ రోగి. రక్త స్రావం ఆగటం లేదు, "మా అపర్ణ్ని, అబ్బాయిని పిలిపించండి." మగతలోనే అన్నాడు. డాక్టర్. మరో పదిహేను నిమిషాల తర్వాత గాంధీ ఆస్పత్రిలో అతణ్ని పరిశీలించిన డాక్టర్లు డాక్టర్ గారు మరణించాడని చెప్పారు.

○ ○ ○

ఆ రోజు నగర వాసులకు ఒక పీడకల. పొద్దున్నే లేచి పేపర్లలో యస్పాయి హత్యని చదివి విభ్రాంతులై ఇంకా తేరుకోకముందే డాక్టరు గారి హత్య! ఊరంతా దిగ్భ్రాంతపోయింది. అంత మంచి మనిషిని, అందరికీ అవసరమున్న మనిషిని ఎందుకు హత్యచేశారు? ఇరవైఏళ్ళ నుంచి ఊరందరి నోళ్ళలో నానుతున్న పేరు ఈ రోజుతో మాసిపోతుందా?

రాజయ్య చెప్పిందంతా విన్న కృష్ణ మెదడు స్తంభించిపోయింది అతనిచేతిలో ఉన్న వస్తువు మీద పిడికిలి బిగుసుకుంది.

"ఈ హత్య చేసిందెవరో కాదు పోలీసులే!" అన్నాడు రాజయ్యతో. రాజయ్య కృష్ణ మొహం చూసి భయపడ్డాడు. అతనికి ఎన్నడూ చూడని మనిషి అతనిలో కన్పించాడు.

"అవును. అందరూ అదే అనుకుంటున్నారు!" రాజయ్య అన్నాడు.

"సరే! ఇకనువ్వు వెళ్లు! ఇక్కడ ఎక్కువసేపుండటం మంచిది కాదు" కృష్ణ కదిలాడు. రాజయ్య అతన్ని జాగ్రత్తగా ఉండమని చెప్పి వెళ్ళిపోయాడు.

కృష్ణ పిచ్చికోపంతో మెయిన్ రోడ్డు మీదనించే నడకసాగించాడు. ఎవడన్నా ఎదురైతే యమలోకానికి పంపేటట్టుగా నడుస్తున్నాడు. రోడ్డుకి రెండు పక్కలా షాపు లన్నీ మూసేసి ఉన్నాయి, అసలు రోడ్ల మీద నడవటానికి గూడా ప్రజలు భయపడు తున్నారు. అందరి ముఖాల్లోనూ భయం, సందేహం తాండవిస్తున్నాయి. అందరూ ఏదో పనులు చేస్తున్నట్టుగా ఉన్నారేగానీ ఎవరి మనసూ మనసులో లేదు. అందరి దృష్టి డాక్టరు గారి ఇంటివైపే.

కృష్ణ డాక్టరుగారి ఇంటిని చేరుకునే సరికి అక్కడికి అందరూ వచ్చి చేరు తున్నారు. అతను కొట్టుకొంటున్న గుండెలతో గేట్లో అడుగు పెట్టాడు. ఇంటిముందు

కొబ్బరి చెట్టు స్తంభించిపోయినట్టుగావుంది ఇంటి కిటికీల మీదికి పాకిన తీగలన్నీ వాడి నల్లబడ్డాయి. ఇంటి ముందు గుమిగూడుకున్న జనంలో విషాదం. కోపం మిళితమై కన్పిస్తున్నాయి. ఒకరిద్దరు మనుషులు ఏడుస్తున్నారు. కొందరు ఇతర్లని అడిగి విషయంతెలుసుకుంటున్నారు. అక్కడ కాలం - స్థలం స్తంభించి పోయాయి.

లోపలికి వచ్చిన కృష్ణకి ఇంటిముందు గోపాల్ కన్పించడంతో వెళ్ళి అతని భుజం మీద చెయ్యి వేశాడు. గోపాల్ తలవంచుకున్నవాడల్లా తలెత్తి చూసి ఏడుస్తూ అతని భుజం మీద తలవాల్చాడు. లక్కడలాంటి అతని దుర్బల శరీరం దుఃఖ భారంతో గజగజలాడింది.

కృష్ణ అతని భుజం మీద అనునయంగా నిమిరాడు. "ఎందుకయ్యా దుఃఖం? అన్నీ తెలిసీ ఏందుకేడుస్తావు?" అన్నాడు.

"ఇంత అవుతుందనుకోలేదు." దుఃఖం తెరలు గోపాల్ ఊపిరి తిత్తుల్ని గురగురమని పించాయి.

"ఎవరు మాత్రం ఎలా అనుకుంటారు? ఈ ఊరిలో నూనూగుమీసాలవస్తున్న ప్రతీయువకుడూ ఎప్పుడో ఒకప్పుడు ఆయన చేత ప్రాణాలు కాపాడబడ్డవాడే. ఆయన చికిత్స చెయ్యని శిశువులు ఇరవైఏళ్ళ నుంచీ ఈ ఊళ్ళో ఎవరూ లేరు. ఆఖరుకు తనని చంపిన పోలీసు పిల్లల్ని కూడా ఆయన ఎన్నోసార్లు మృత్యుముఖం నించి తప్పించాడు. అలాంటి వాణ్ని ఎవరైనా చంపుతారని ఎవరన్నా అసలెలా ఊహిస్తారు?" కృష్ణ అన్నాడు

ఇంతలో గేటులోంచి సైకిలు తొక్కుకుంటూ బాజీరావు వచ్చాడు వస్తూనే అతడు సైకిలు అటుపైపు పడేసి కృష్ణనీ, గోపాల్‌నీ కావిలించుకుని ఏడ్చాడు. "ఎంత పని చేశారయ్యా లంజ కొడుకులు !" అని కళ్ళుతుడుచుకుని "బాడీ ఎప్పుడిస్తారట?" అనడిగాడు.

'రేపిస్తారట' అప్పుడే అక్కడికి వచ్చిన పత్రికా విలేకరి ఒకాయన అన్నాడు.

ఎక్కడినుండి వచ్చాయో పాడు మబ్బులు. ఉదయంనుంచీ ఊరిమీద వాలి జల్లుగా కురిసి చీకాకు పెడుతున్నాయి. ఊరు గుండెలో గూడుకట్టుకున్న భయం, విషాదం కరిగిపోవటానికి సూర్యోదయం ఇంకా కాలేదు. డాక్టరు గారి ఇంటి ముందు పౌరజనం ఆయన అంతిమ దర్శనం కోసం బారులు తీరారు. మొదట పదులు, తర్వాత వందలు వేలల్లోకి మారింది జనసంఖ్య. యాభై రెండేళ్ళ యువకుడు ఎన్నడూ నవ్వుచెరగని మొహం. విశ్వాసం సడలని నుదురు. అనుభవం పండిన జుత్తు మనుషుల మీద అచంచలమైన ప్రేమ, విశ్వాసం కలబోసుకున్న అంత

రంగం. ఆయన డాక్టరు, ఆయన మిత్రుడు, ఆయన మనిషి, కొబ్బరి బోడెను అను కుని కృష్ణ ఆలోచిస్తున్నాడు,

తుంపర మొదలై వర్షంగా మారింది, ఒక్కొక్కరూ రావటం మొదలై జన ప్రవాహమైంది. ఊరంతా అక్కడే వుంది. ప్రభుత్వం సైతం అక్కడే వుంది. ఆర్డీవో వచ్చిచూసి వెళ్ళాడు. పోలీసులు చుట్టూ మోహరించారు. వాతావరణంలో గంభీరత మనసుల్లోనూ వుంది.

తాత్కాలికంగా ఏర్పర్చిన వేదికమీద డాక్టరుగారి భౌతికకాయాన్ని ఉంచారు. పల్లె జనం ఎదురుచూస్తున్నారు. జనంలో కలకలం మొదలైంది. పోలీసు అధికారి ఒకడు డాక్టరు గారి శవాన్ని సమీపించాడు. జనంతోపాటు తానూ దర్శనం చేసు కున్నట్లు నటించాడు. టోపితీసి చేత పట్టుకున్నాడు. క్షణం తర్వాత మళ్ళీ ధరించాడు పక్కకి జరిగి అక్కడున్న ఒక పెద్దమనిషితో అన్నాడు.

"త్వరగా కార్యక్రమం కానిస్తేమంచిది. ఆలస్యమవుతున్న కొద్దీ పరిస్థితులు మారుతాయి."

వింటున్న కృష్ణ పళ్ళుకొరికాడు. బతుకూ వీడిష్టమే చావూ వీడిష్టమేనా ? ఇంతలో పెద్దమనిషి అన్నాడు. "రావల్సిన వాళ్ళందరూ రాలేదండీ! వచ్చాకఅలాగే జరుగుతుంది."

పోలీసు అధికారి నిట్టూర్చాడు "వచ్చిన వాళ్లు ఏం చేశారని ఇకరాబోయే వాళ్లు వచ్చి చేసేదేముంది? మనిషే పోయాక ఎవరు వచ్చి ఏంలాభం?" వేదాంతం మాట్లాడాడు

కృష్ణకు దుఃఖం పొర్లింది ఐనా కళ్ళ వెంట నీటిచుక్క రాలేదు. కన్నీరు ఇగిరి దుఃఖం నలిపేస్తోంది. ఎదురుగా రాజారావు, బాజీరావు గుండెలు అవిసేట్టుగా ఏడుస్తున్నారు.

డాక్టరుగారి అంతిమ దర్శనం కోసం వచ్చే జనాన్ని భయపెట్టటం కోసం నలుమూలల మీద పోలీసులు జీపుల్నీ, వ్యాన్లనీ నిలబెట్టారు. తుపాకులు చంక నేసుకుని వీధిఅంతా పహరా ఇచ్చారు జనం భయపడలేదు. రావటం మానలేదు.

బాజీరావు కళ్ళు తుడుచుకుంటూ కృష్ణ దగ్గరికి వచ్చాడు, 'ఊరు తగలబడి పోతుందని అందరూ అనుకుంటున్నారు' అన్నాడు

'ఎవరు తగలబెడతారు ?'

'డాక్టరుగారి హత్యకు ప్రతీకారంగా రాడికల్సే ఆపనిచేస్తారని అనుకుంటున్నారు"

కృష్ణనవ్వాడు. "ఇది పోలీసులు సృష్టించిన కట్టుకథే అయివుంటుంది. ఆ వుద్దేశమేవుంటే ఇరవై నాలుగ్గంటలు ఆగుతారా ? అన్నాడు.

"ఊరు ఉనికిని మరచింది. మనుషులు నిద్రని మరిచారు. అరే ! ధర్మరక్షకుడు నీకునీవే పూసుకున్న దురహంకారీ! నీకు తెల్లవారింది గమనించు. దురన్యాయపూరితుడవై దురాగ్రహంతో అంధుడవై నువు బరితెగించి, కత్తితో, దోపిడీతో ఏకారి హైనావలె జనంమీద విరుచుకు పడ్డావు, నీచేత గల కత్తి రక్తదాహంగల రేచుకుక్క నాలిక. ఇప్పుడు నువు కుక్కవు. ఇక నీగతి అధోగతి'— అనుకుంటున్నాడొక భావుకుడు

'బిడ్డా! నువునాకు పితృత్వం కలిగించిన క్షణాన్ని నేను మరచిపోలేను. కానీ నాపితృత్వాన్ని కాపాడిన మనిషిని గూడా మరచిపోలేను. నువు ఆరోగ్యంగా, చైతన్యవంతంగా ఉన్నది కొద్దిరోజులే. కాని తర్వాత నువునాకిచ్చిన ఆనందంకన్న దుఃఖమే ఎక్కువ. కానీ నీవయసు ఈనాడు ఇరవై ఏళ్లు. నిన్ను మృత్యువు నోటిలోంచి చిటికెన వేలితో బయటికి లాగిన ఆ మనిషి ఈనాడు....' అనివిలపిస్తున్నాడొక తండ్రి.

'నా బిడ్డను కాపాడితివి. నీ ప్రాణం చూసుకోలేకపోతివా? వాళ్ళ బిడ్డల్ని నీ దగ్గర బతికించుకున్నారు. నిన్నే చేతులారా చంపేశారా ? మేమంతా నీ మనుషులమే నిన్నుకాపాడుకోలేక పోతిమే. ఊరంతా నీ బిడ్డలే. మా బిడ్డలందరికి నువుపోసిన ఊపిరే. ఇప్పుడెవరూ మా బిడ్డలకు దిక్కు ? నీలాంటి వాడెవడున్నాడు? అసలున్నాడా? అసలుంటాడా?' అని ఘోషిస్తోందొక తల్లి.

* * * *

రెండు రోజుల్నించీ ఊరు మొత్తం స్తబ్దంగా వుంది. ఎవరు చెప్పకున్నా జనం బంద్ పాటించారు. ఇంటిచుట్టూ దిట్టంగా పోలీసు బందోబస్తు, పైగా సీక్రెట్ ఏజెంట్ల హడావిడీ ఉన్నప్పటికీ ఆయన భౌతికకాయాన్ని దర్శించని పురజనుడులేడు కంటతడి పెట్టని లప్డీకొడుకులేడు. ఆరోజు గూడా తనవంతుగా అరగంటసేపు జల్లు కురిసింది.

ఆఖరికి-రెండవ రోజు శవయాత్ర మొదలైంది. వందమంది పోలీసులు రైఫిళ్ళు పిస్తోళ్ళు ధరించి రెండు పందలమంది ఉన్న ఊరేగింపుని సూపర్వైజ్ చేస్తుంటే ఊరంతా ఇండ్లెక్కి చూసింది. మిద్దెలెక్కి చూసింది. మేడలు, డాబాలు అన్నీ ఎక్కి ఊరు కళ్ల రిక్కించింది. జనం వినావాల్ని దిగమింగి ద్వేషాన్ని కళ్ళలోంచి కక్కారు.

మహాత్మాగాంధీ రోడ్డుమీద హింసకు బలైన డాక్టరుగారి శవం వెనక అహింసా పోలీసుల బూట్ల చప్పుడులో విప్లవ నినాదాలు అణిగిపోయాయి. కోపంతో గొంతులు పెగలకపోతే అది భయంగా భ్రమించారు. భయం జనాన్ని రెచ్చగొట్టింది. కొత్త వాడలోకి శవయాత్ర చేరేసరికి జనం రెండింతలయ్యారు. కొత్తవాడదాటి ఆటోనగర్ స్మశానం చేరేసరికి నాల్గింతలయ్యారు. శ్మశానం గేటు దగ్గర పోలీసుల కాపలా. మనుషుల మొహాల్ని చూడటం, వదలటం, ఏమాత్రం పనికి వచ్చే మనిషైనా లాగి వ్యాన్లో ఎక్కించటం, పోలీసులు స్మశానం చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. ముఖ్యులిన తప్ప ఎవర్నీ లోపలికి పోనీయలేదు. లోపల ముళ్ళ కంపలు, కాలినచితుల బూడిదలు, వర్షానికి చిత్తడిగా మారిననేల. స్మశానం బీభత్సంగా వుంది. ఎక్కడినుంచి పుట్టుకొచ్చారో తెలియదు. ముళ్ళపొదల చాటునించీ, సమాధుల వెనకనించీ జనం వచ్చి చేరుతున్నారు. ఎవడు ఎక్కడ ఎవర్ని ఆపితేనేం? ఎవరు ఎక్కడికి రావాలో వాళ్ళంతా అక్కడికి వచ్చి చేరుతూనే వున్నారు. అంతదాకా గంభీరంగా వున్నవాళ్లు కూడా అక్కడికి వచ్చాక ఏడపకుండా ఉండలేక పోయారు.

కృష్ణ ఒక సమాధినానుకుని నిలబడ్డాడు. ఎదురుగా చితిమీద డాక్టరుగారు. ఎక్కడెక్కడి జనమో, ఏనాటి జ్ఞాపకాలో, ఏతీరు కృతజ్ఞతో వచ్చి చితికి నమస్కరిస్తున్నారు. ఆయన పాదాలకి దండం పెడుతున్నారు. శత్రువు చక్రవ్యూహం జనం ప్రేమని ఆపలేకపోయింది. మఫ్టీలో ఉన్న స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు బిత్తరపోయి చూస్తున్నారు. ఎంత రహస్యంగా కనీసం పరిమితంగానైనా దహనకార్యక్రమం జరిపిద్దామనుకుంటే చివరికి ఇంత పెద్దగా తయారైంది. ప్రహరీ గోడచుట్టూ పోలీసులు దూరంగా ఇళ్లు ఎక్కిచూస్తూ జనం.

ఎదురుగా ప్రాణదాత ప్రజ్వలిస్తున్నాడు. ప్రాణదాత నుంచి చెలరేగుతున్న, మంటల కొసలమీద విషాద వర్తమానమూ, ఆశావహ భవిష్యత్తూ సంఘర్షిస్తున్నాయి.